క్లుప్తంగా

నాణ్యమైన భోజనం వడ్డించాలి



ఆర్.బి.కొత్తూరులో విద్యార్థులకు నూతన పుస్తకాలను అందజేస్తున్న జేసీ

పెద్దాపురం: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనం వడ్డించే విధంగా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ఆర్.బి.కొత్తూరు పాఠశాలలో గురువారం ఆయన పాఠశాలకు వచ్చిన సన్నబియ్యాన్ని పరిశీలించి విద్యాశాఖాధికారులకు పలు ఆదేశాలను జారీ చేశారు. విద్యార్థులకు సన్నబియ్యంతో నాణ్యమైన భోజనం వడ్డించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. కావున మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చెయ్యాలని జేసీ సూచంచారు. అనంతరం పాఠశాలలకు వచ్చిన పదవ తరగతి నూతన పుస్తకాలను ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ శర్మ, ఎంఈఓ చౌదరి, తహసిల్దార్ వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం



సామర్లకోట అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు నిర్వహిస్తున్న సామూహిక అక్షరాభ్యాసం

సామర్లకోట: అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం పలువురు చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. పెద్దాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో స్థానిక బ్రౌన్‌పేట సెక్టార్‌లో ర్యాలీ నిర్వహించి మూడేళ్లు నిండిన చిన్నారులను గుర్తించి వారిని అంగన్వాడీ కేంద్రాలల్లో చేర్పి అక్షరాభ్యాస కార్యక్రమం చేపట్టారు. సెక్టార్ సూపర్‌వైజర్లు ఎండీ సుల్తానాబీబీ, ఉమాదేవి, అంగన్వాడీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొమరగిరిలో అంగన్వాడి పిలుస్తోంది



కొమరగిరిలో పిల్లలకు సాముహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీవో

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి శివారు చిన్నకలవలదొడ్డిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాంలో గురువారం పిఠాపురం సీడీపీవో దుర్గాదేవి ఆధ్వర్యంలో అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమన్ని నిర్వహించారు. సాముహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం గ్రామంలో చిన్నారుల నర్సరీ విద్యబోధన, ప్రీ స్కూలు విద్య, కొమార దశలో ఉన్న యువతులకు వ్యక్తిగత ఆరోగ్య సూచనలు సలహాలు, బాల్య వివాహాలు రక్షణ చట్టంపై ఆవగాహన అంశాలపై ర్యాలీ నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సారమ్మ, అంగన్వాడిలు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సందేశాత్మక నాటకం

ఏలేశ్వరం: తండ్రి కూతుళ్ల అనుబంధాన్ని కళ్లకు కట్టినట్టుగా చూపించిన ఇగో నాటకం ఆద్యంతం ఆకట్టుకుంది. మండలంలోని తిరుమాలి గ్రామంలో నేరేళ్లమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా బుధవారం రాత్రి ఇగో నాటకాన్ని ప్రదర్శించారు. తిరుమాలి గ్రామానికి చెందిన నటుడు కట్టా వెంకటేశ్వరరావు రచించి దర్శకత్వం వహించారు. గ్రామానికి చెందిన కళాకారులు ఓలేటి చంటిబాబు, మాగాపు శ్రీనివాస్, కట్టా శ్రీనివాస్, కట్టా పండు, సుజాత నటించారు.

తల్లిదండ్రులకు చెప్పకుండా లేచిపోయి ప్రేమ వివాహాలు చేసుకుంటున్న యువతను ఆలోచింప చేసే విధంగా నాటకం కొనసాగింది. పెంచి పెద్దచేసిన పిల్లలు తమను లెక్కచేయకుండా ప్రేమవివాహాలు చేసుకుంటే తండ్రి పడే అవేదన ప్రేక్షకులను కట్టిపడేసింది. తల్లిదండ్రులను మెప్పించి వారి ఇష్టాలకు అనుగుణం నడుచుకోవాలని నాటకంలో సందేశం ఇచ్చారు. అనంతరం దర్శక, రచయిత కట్టా వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు.



దర్శక, రచయిత వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

రైలెక్కేందుకు సౌకర్యాలు ఏవి..!

- అభివృద్ధి నరే.. కనీస సౌకర్యాలు కరవు
- ఎండైనా, వానైనా వేచి చూడాల్సిన పరిస్థితి
- నీడనిచ్చే వందేళ్ల చరిత్ర కలిగిన చెట్ల కూల్చివేత
- వాహనాల పార్కింగ్‌కు షెడ్ల కొరత



రైల్వే స్టేషన్ ఆవరణలో నీడ లేక.. ఎండలో ఉన్న వాహనాలు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేసే సమయంలో ప్రయాణికుల సౌకర్యాలపై శ్రద్ధ చూపడం లేదు. 1893లో అప్పటి బ్రిటిష్ అధికారులు స్థానికంగా సుగర్ ఫ్యాక్టరీ ఉండటంతో పరిస్థితుల దృష్ట్యా పంచదార ఎగుమతే లక్ష్యంగా రైల్వే స్టేషన్ ఏర్పాటు చేశారు. సామర్లకోట నుంచి కాకినాడకు రాకపోకలు సాగించే వారి కోసం లింక్ రైళ్లు నడిపేవారు. క్రమేపీ వాటికి స్వస్తి పలికారు. వైఎస్సార్ సీపీ మాజీ ఎంపీ వంగా గీత కృషితో సామర్లకోట రైల్వే స్టేషన్‌కు రూ.26 కోట్ల నిధులు విడుదలవ్వగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

పచ్చదనం తొలగింపు


అభివృద్ధి పనుల్లో భాగంగా రైల్వే స్టేషన్ ఆవరణలో వాహనాల పార్కింగ్ చేసే ప్రదేశంలో రెండు రావి చెట్లు, రెండు నిద్ర గన్నేరు చెట్లు ఉండేవి. ఆ చెట్ల నీడలోనే వాహనాలు పార్కింగ్ స్టాండ్ నిర్వాహకులతో పాటు ప్రయాణికులు వేచి ఉండి విశ్రాంతి తీసుకొనే వారు. సుమారు 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆ చెట్లను నరికి వేశారు. దీనితో తమ బంధువులను తీసుకువెళ్లడానికి వచ్చిన వారు ఎండలో మాడిపోతున్నారు. వాహనాలను పార్కింగ్ స్టాండ్‌లో పెట్టి ప్లాట్‌ఫాం పైకి వెళ్లాలంటే పార్కింగ్ ఫీజుతో పాటు ప్లాట్‌ఫాం టిక్కెటు వారికి మరిత భారంగా మారుతుంది. చెట్లను నరకకుండా వాటి చుట్టూ అభివృద్ధి చేస్తే ఎంతో ఆహ్లాదంగా ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో వందేళ్ల వృక్షాలు (పాత చిత్రం)

పాడైపోతున్న వాహనాలు

జిల్లాకు ముఖ్యకూడలి ప్రదేశంతో పాటు, రైల్వే స్టేషన్–బస్సు కాంప్లెక్స్ ఎదురెదురుగా ఉన్న రాష్ట్రంలో సామర్లకోటలో ఉంది. దాంతో వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాల కోసం రాకపోకలు సాగించే వారు తమ కార్లను, మోటారు సైకిళ్లను స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో పార్కింగ్‌లో నిలుపుతారు. పార్కింగ్ చేసిన వాహనాలకు నీడ లేకపోవడంతో వాహనాలు ఎండకు ఎండి, వానకు నాని పాడైపోతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. పార్కింగ్ లీజుదారులకు షెడ్లు వేసుకొవడానికి రైల్వే అధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీనిని అనువుగా తీసుకొని సమీపంలోనే కొంత మంది షెడ్లు ఏర్పాటు చేసి పార్కింగ్ స్టాండ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దాంతో రైల్వే స్టేషన్ ఆవరణలోని పార్కింగ్ లీజుదారులు నష్టపోవలసి వస్తుందని వాపోతున్నారు.



బ్రిటిష్ వారి కాలంలో రైల్వే స్టేషన్

సదుపాయాలు మెరుగుపర్చాలి



దూర ప్రాంతాల నుంచి వచ్చేవారిని తీసుకు వెళ్లడానికి సామర్లకోట రైల్వే స్టేషన్ ఆవరణలో వేచి ఉంటున్నాం. నీడను ఇచ్చే చెట్లు తొలగించడం, సిమెంటు రోడ్లు ఏర్పాటు చేయడంతో ఎండ కారణంగా ఆవరణలో నిలబడలేని పరిస్థితి ఉంది. అటువంటి చరిత్ర కలిగిన చెట్లు పెంచాలంటే కొన్ని సంవత్సరాలు పడుతుంది. వాహనాలు ఎండకు, వర్షాలకు పాడైపోతున్నాయి. ప్రయాణకులు బయట వేచి ఉండటానికి, వాహనాల పార్కింగ్‌కు షెడ్లు ఏర్పాటు చేయాలి.

– కరణం రాజ్‌కుమార్, కౌన్సిలర్, సామర్లకోట

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం



రైల్వే స్టేషన్ అభివృద్ధిలో భాగంగా స్టేషన్‌కు ముందు భాగంలో ఉన్న చెట్లను తొలగించారు. ప్రయాణికులు వేచి ఉండటానికి పోర్టికోను పెంచుతున్నాం. స్టేషన్‌లో అభివృద్ధి పనులు పూర్తి అయిన తరువాత వాహనాల పార్కింగ్ ఒక క్రమంలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాం. వాహనాల పార్కింగ్ షెడ్లు నిర్మాణం చేయాలని వినతి పత్రాలు వస్తే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పార్కింగ్ షెడ్లు నిర్మాణం చేసే విధంగా చర్యలు తీసుకొంటాం. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతాం. ప్లాట్‌ఫాంలపై ప్రయాణికుల కోసం షెడ్ల నిర్మాణం జరుగుతుంది.

– మేడిశెట్టి రమేష్, స్టేషన్ మేనేజరు, సామర్లకోట

నిత్యం యోగా శిక్షణ నిర్వహించాలి



సచివాలయ సిబ్బందితో యోగా నిర్వహణపై చర్చిస్తున్న కమిషనర్ శ్రీవిద్య

సామర్లకోట: సచివాలయాల పరిధిలో ప్రతీ రోజు తప్పని సరిగా యోగా శిక్షణను నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో సచివాలయాల అడ్మిన్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. యోగా నిర్వహించే సమయంలో ఫొటోలు, వీడియోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఈ మేరకు యోగా నిర్వాహణపై పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. ఈ నెల 14 నుంచి 21 వరకు నిర్వహించే యోగాకు సంబంధించి పర్యవేక్షణ ఆధారంగా ఉత్తమ సచివాలయ సిబ్బందిని ఎంపిక చేసి పురస్కారాలు అందజేస్తామన్నారు. యోగా వలన ప్రయోజనాలను ఆయా సచివాలయాల పరిధిలో ప్రజలకు తెలియజేయాలన్నారు. యోగాలో పాల్గొన్న సభ్యుల సంఖ్య, వారితో వేయించిన ఆసనాలు ఆధారంగా బహుమతులు ఉంటాయన్నారు. యోగా నిర్వహించని అడ్మిన్‌పై చర్యలు ఉంటాయని కమిషనర్ హెచ్చరించారు.

వంద శాతం అమలు చేయాలి



ఉండూరులోని విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ-2 పుల్లయ్య

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని 100 శాతం అమలు జరిగే విధంగా ప్రతీ ఒక్క విద్యార్థి భోజనం చేసే విధంగా సిబ్బంది చూడాలని మండల విద్యాశాఖాధికారి–2 పి. పుల్లయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉండూరు జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకం తీరును ఆయన పరిశీలించారు. గురువారం నుంచి పాఠశాలలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన బియ్యం స్టాక్‌ను పరిశీలించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతీ ఒక్కరూ భోజనం చేసేలా ప్రోత్సాహించాలని ఆయన సూచించారు. భోజనంలో నాణ్యత లోపిస్తే సదరు సిబ్బంది చర్యలు ఉంటాయన్నారు. అనంతరం మెనోను ఎంఈఓ పరిశీలించి భోజనం రుచి చూశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఉన్నారు.

కష్టపడేవారికి ఎల్లప్పుడు గుర్తింపు



వంగా గీతతో పార్టీలో కొత్తగా నియమితులైన వివిధ విభాగాల నాయకులు

పిఠాపురం: వైఎస్సార్ సీపీ పార్టీ కోసం కష్టపడే ప్రతీ ఒక్కరికి పార్టీలో తగిన గుర్తింపు ఎల్లప్పుడు ఉంటుందని పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పిఠాపురం మున్సిపాలిటీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. గురువారం నూతనంగా నియమించబడిన నాయకులు ఆమెను స్థానిక పార్టీ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు వివిధ విభాగాల్లో నిష్ఠాతులైన కార్యకర్తలను నాయకులను అధ్యక్షులుగా నియమించడంతో పార్టీపై నాయకుల్లో నమ్మకం విశ్వాసం పెంచిన ట్లైందన్నారు. ప్రతీ ఒక్కరు తమకు ఇచ్చిన పదవులతో నియోజకవర్గంలో పార్టీని ముందుకు నడిపించి ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకాన్ని పెంచాలన్నారు. ప్రతీ ఒక్కరు పార్టీ సూచించిన కార్యక్రమాల్లో పాల్గొని ప్రజల తరుపున పోరాటాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ మేరకు పదవులు పొందిన బోనాసుల రాజా, సోమరౌతు లలిత, చవ్వాకుల ఆనంద్, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, బత్తిన రాజశేఖర్, మర్రి మహేష్, ఖలీల్‌షా, మాసా రాంబాబు, కట్టు అజయ్, జోగా రత్నరాజు, చోడిశెట్టి శ్రీనివాసరావు, షేక్ ఖాదా వల్లీ బాబా, కంభంపాటి ఎస్ఆర్ఎస్‌పీ ప్రసాద్, గిడుతూరి దుర్గారావు, జగడాల రాజు, గునా గీత, నల్లమిల్లి పవన్, పేపకాయల వీరవెంకటప్రసాద్, దూరా సోటు తదితరులు ఆమెను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమపై పార్టీ పెట్టిన బాధ్యతను తమ శక్తి వంచన లేకుండా పని చేసి పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా ఆమెకు తెలిపారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ

సామర్లకోట: వివిధ ప్రాంతాల నుంచి బదిలీలపై వచ్చిన ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్.ఎం తోటకూర సాయి రామకృష్ణ అన్నారు. ఇటీవల పాఠశాల నుంచి 15 మంది ఉపాధ్యాయులు బదిలీ కావడం వారి స్థానంలో పిఠాపురం, తుని, రామచంద్రపురం మున్సిపాలిటీల నుంచి ఉపాధ్యాయులు బదిలీలపై రావడంతో గురువారం ఉపాధ్యాయులతో హెచ్.ఎం సమావేశం ఏర్పాటు చేసి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. 10వ తరగతి విద్యార్థులపై ఇప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు 100 శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలన్నారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు వివరించాలన్నారు. వార్డు కౌన్సిలర్ బలుసు వాసు మాట్లాడుతూ నూతనంగా బాధ్యత స్వీకరించిన ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలన్నారు.

బాలలతో చాకిరీ చట్టరీత్యా నేరం

- జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారాణి
- బాలల హక్కులపై అవగాహన ర్యాలీ



మూలపేటలోని పాఠశాలలో బాలల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దుర్గారాణి

కొత్తపల్లి: బాలలతో పని చేయించడం, ఏదైనా పనిలో నియమించడం చట్టరీత్యా నేరమని, ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్ట ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలు బడిలో ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సెలర్ బి.దుర్గారాణి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయ కుమారి ఆదేశాల మేరకు పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ దుర్గాదేవి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని మూలపేటలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాలలో అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాలల హక్కులపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ బాల కార్మికులు ఉన్నారని తెలిసినట్టయితే 1098కి ఫోన్ చేసి సమాచారం అందించాలని ఆమె కోరారు. బాల బాలికలను చైతన్య వంతులుగా తీర్చిదిద్దడానికి కిశోరి వికాసం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి కుటుంబం ఆర్థికంగా స్థిరపడడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఎంత సంపాదించామన్నది కాకుండా ఎంత ఖర్చు చేస్తున్నాం, ఎంత పొదుపు చేస్తున్నాం అనే అంశంపై ప్రణాళిక ఉన్నట్లయితే సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగడానికి అవకాశం ఉందన్నారు.

సైబర్ నేరాలపై సమాచారం ఇవ్వడానికి 1930కి ఫోన్ చేయాలన్నారు. విద్య స్థిరమైన, సంతోషకరమైన జీవితానికి దోహదపడుతుందన్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం అందిస్తుందన్నారు. అంతే కాకుండా తప్పొప్పులపై అవగాహన కలిగిస్తుందని ఆమె పేర్కొన్నారు. బాలలకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా 1098కు ఫోన్ చేసి సమాచరం అందించాలన్నారు. పిఠాపురం ప్రాజెక్ట్ విస్తరణాధికారి లలిత మాట్లాడుతూ 18 ఏళ్లు నిండకుండా అమ్మాయికి, 21 ఏళ్లు నిండకుండా అబ్బాయికి వివాహం చేస్తే బాల్య వివాహంగా పరిగణించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, వివాహం చేయగానికి ప్రోత్సహించిన వారందరికీ బాల్య వివాహ నిషేధిత చట్టం 2006 ప్రకారం శిక్ష విధించడం జరుగుతుందన్నారు. ఈ కర్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి



కొండపల్లి శ్రీనివాసును సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప తదితరులు

సామర్లకోట: క్రీడాకారులను ప్రతీ ఒక్కరూ ప్రోత్సహించవలసిన అవసరం ఉన్నదని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాసు సన్మానం సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ నెల 5 నుంచి 8 వరకు మచిలీపట్నంలో జరిగిన 12వ అంతర్జాతీయ బీచ్ కబడ్డీ పోటీలో రాష్ట్ర జట్టు బంగారు పతకం సాధించడానికి కొండపల్లి శ్రీను విశేష కృషి చేశారు. టీంకు మేనేజర్‌గా వ్యవహరించి క్రీడాకారులకు మెలుకువలు ఇవ్వడం తోనే జట్టు బంగారు పతకం సాధించిందని ఎమ్మెల్యే కొనియాడారు. సామర్లకోటలోని అనేక మంది కబడ్డీ క్రీడాకారులు ఉన్నారని వారికి మంచి తర్ఫీదు ఇచ్చి ఉన్నత క్రీడాకారులుగా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు, మాజీ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని తదితరులు పాల్గొన్ని కొండపల్లి శ్రీనివాసును అభినందించారు.

ప్రభుత్వం మెడలు వంచాల్సిందే



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పెద్దాపురం: పనిగంటల వ్యవధిని ఎనిమిది గంటల నుంచి పది గంటలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచడాన్ని నిరశిస్తూ సీఐటీయూ పెద్దాపురం మండలం కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని రాష్ట్ర ప్రభుత్వం పది గంటలకు పెంచిందన్నారు. ప్రజలు అల్లాడిపోయి కనీస వేతనం అమలు చెయ్యమంటే దాన్ని ఊసు ఎత్తడం మానేసి పని గంటలను పెంచడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం కార్మిక వర్గంపై కక్ష కట్టిందన్నారు. కార్మికవర్గ పోరాటాలకు ప్రభుత్వం మెడలు వంచాల్సిందేనన్నారు. జూలై 9వ తేదీన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె జరుగుతుందని, సమ్మెలో కార్మికవర్గంలో అందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు సత్తిబాబు, చింతల సత్యన్నానాయణ, తాడిశెట్టి గంగ, వడ్డి సత్యన్నారాయణ, లోవకుమారి, చిన్నారి, మణికుమారి, రామలక్ష్మి, చల్లా విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

అల్ట్రా స్కాన్ సెంటర్ ఏర్పాటు చేయాలి



శ్రీశివశంకర దుప్పట్ల సంఘం నూతన కార్యవర్గం

సామర్లకోట: ప్రభుత్వాస్పత్రుల్లో అల్ట్రా స్కాన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని శ్రీ శివశంకర దుప్పట్ల సంఘ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం దుప్పట్ల సంఘం 41వ మహాసభ సందర్భంగా మెహర్ కాంప్లెక్స్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వాస్పత్రులు 24 గంటలు పని చేస్తున్నా అల్ట్రా స్కాన్ సెంటర్ లేక రోగులు కాకినాడ వెళ్లాలసి వస్తుందన్నారు. గత 40 ఏళ్లుగా అనేక ప్రభుత్వాలు మారినా ప్రభుత్వాస్పత్రులలో ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పించడంలో వైఫల్యం చెందుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కరణం ప్రసాదరావు, బాలం శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

దుప్పట్ల సంఘం నూతన అధ్యక్షుడిగా కరణం శ్రీనివాసరావు, కార్యదర్శిగా కరణం సత్యనారాయణ, కోశాధికారిగా పోతుల సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సహయ కార్యదర్శిగా గుడ్ల నారాయణ, ఉపాధ్యక్షుడిగా కత్తిరి కమిటీ సభ్యులు పెంకే వెంకటరాజేష్, కరణం గోవిందరాజులు ఎన్నిక అయ్యారు.

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

ప్రత్తిపాడు రూరల్: నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల్లో పర్యటించి, ప్రజల సమస్యలు గుర్తించి, పరిష్కారానికి పాటుపడతానని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. బవురువాక గిరిజన గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసి ప్రజలను మోసం చేసిందని అన్నారు. నమ్మించి మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యని విమర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేకూరిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పిఠాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్లు బోధించడానికి గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి గురువారం తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులుగా దరఖాస్తు చేసుకునే వారు ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్, లేదా ఎంటెక్ కంప్యూటర్స్, ఎంసీఏ 55 శాతం మార్కులతో ఏదైనా అర్హత కలిగి ఉండాలన్నారు. కంప్యూటర్ అప్లికేషన్స్ బోధనకు దరఖాస్తు చేసుకునే వారు ఎంసీఏ, ఎంటెక్ కంప్యూటర్స్‌లో 55 శాతం మార్కులతో ఏదైనా అర్హత కలిగి ఉండాలన్నారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు.

కనక దుర్గమ్మకు ఘనంగా చండీహోమం



చండీహోమంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి జన్మనక్షత్రం మూల సందర్భంగా గురువారం చండీహోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఐదుగురు భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు.